

Dr.G.Rajesh

CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 100 ఎడిటర్ : జి.రాజేష్ సోమవారం 06 జులై 2026 పేజీలు : 6 వెల రూ. 4.00


# గొడ్డలి పార్టీ నేతలు కూటమి ప్రభుత్వంపై కుట్రలు, బూతులు, హింస!





- వైసీపీ నమ్ముకున్నది వీటినే.. ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఫండింగ్
- నన్ను, పవన్‌ను దూషించేందుకు సోషల్ మీడియాకు నిధులు
- కంపెనీల తరిమివేతే వారి పని
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధిని అడ్డుకోలేరు
- క్వాంటమ్, సెమీకండక్టర్లలో ఏపీకి భారీగా పెట్టుబడులు
- కుప్పంలో చంద్రబాబు వెల్లడి
- టీడీపీ నేతలు, శ్రేణులతోనూ భేటీ
- స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం

2029లో గతం కంటే మెజారిటీలు పెరగాలి: సీఎం

- సొంత నియోజకవర్గంలో ముగిసిన మూడ్రోజుల పర్యటన

కుప్పం, ఐఎన్‌బిటైమ్స్

'గొడ్డలి పార్టీ నేతలు ప్రత్యేకంగా ఫండింగ్ చేసి మరీ కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. ప్రభుత్వాన్ని, నాయకులను తిట్టిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. కుప్పం పర్యటనలో భాగంగా ఆదివారం మూడో(చివరి) రోజు ఆయన కడపల్లెలోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. టీడీపీ శ్రేణులతోనూ సమావేశమయ్యారు. 'నాతో పాటు పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేసేందుకు కొన్ని సోషల్ మీడియా గ్రూపులకు పెద్దఎత్తున నిధులు ఇస్తున్నారు. హింస, బూతులనే గొడ్డలి పార్టీ నమ్ముకుంది. ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తోంది. ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్ర మాలను అడ్డుకోలేరు' అని తేల్చిచెప్పారు

. 'ఇంధన రంగంలో సౌర, పవన విద్యుదుత్పత్తితో పాటు ఇతర అత్యుత్తమ విద్యుత్ సరఫరా విధానాలను అందుబాటులోకి తెస్తున్నాం.దేశంలోనే ప్రముఖ స్టీల్ పరిశ్రమలైన ఆర్సెలార్ మిట్టల్, జిందాల్ సౌత్‌వట?స్ట (జేఎస్‌డబ్ల్యూ) కంపెనీలు రాష్ట్రంలో ఉక్కు కర్మాగారాలను నిర్మిస్తున్నాయి. పరిశ్రమలకే కాకుండా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనానికీ ప్రాధాన్యం ఇస్తున్నాం' అని తెలిపారు. గత పాలకులు కంపెనీలకు భూములిచ్చి వివాదాలు సృష్టించారని ఆరోపించారు. ఒడిసాలో ఖనిజ సంపదతో ఆ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తే.. ఏపీలో కేవలం ఒకే ఒక్క వ్యక్తి లబ్ధి కోసం విలువైన భూములు, ఖనిజ సంపదను బ్లాక్ చేశారని ధ్వజమెత్తారు. ఆన్‌రాక్ సహా పలు సంస్థలు ఇబ్బందుల్లో పడ్డాయని చెప్పారు.

మిగతా 2లో



## జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ ప్రక్రియ విజయవంతం

- 25 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో గతనెల 25న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా 35వేల దరఖాస్తులు
- ఏడు రోజులపాటు కొనసాగి ఆదివారం ముగిసింది

2లో



## ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని శ్రీసిటీలో అమలు చేసేందుకు సిద్ధం

- ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, చిప్స్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా
- ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్ర యూనివర్సిటీల్లో నైపుణ్యాభివృద్ధితో కూడిన కరిక్యులమ్
- ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని శ్రీసిటీలో అమలు రాష్ట్ర తీరప్రాంతంలో హెచ్‌డీ హ్యూండయ్
- తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డు ఏర్పాటు భారత రాయబారికి లోకేశ్ అభ్యర్థన

2లో

## అయోధ్య రామాలయ విరాళాల అక్రమాలపై దర్యాప్తులో సంచలన విషయాలు

- నిత్యం రూ.6-8 లక్షలు నొక్కేసిన వైనం
- అయోధ్య విరాళాల పక్కదారిలో వెలుగులోకి సంచలన విషయాలు
- రూ.5 కోట్ల రామచరిత్ మానస్ పుస్తకం కూడా మాయం?



లక్నో, న్యూఢిల్లీ **ఐఎన్‌బిటైమ్స్** అయోధ్య రామాలయ విరాళాల అక్రమాలపై దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రోజుకు ఏకంగా రూ.6 నుంచి రూ.8 లక్షల మధ్య రాముడి సొమ్ము అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లి ఉంటుందని అంచనా. బ్యాంక్ అధికారులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రశ్నించినప్పుడు ఈ విషయాలు వెల్లడయ్యాయి. అక్రమాలు వెలుగుచూడక ముందు వరకు రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బ్యాంక్ ఖాతాకు రోజూ రూ.16-18 లక్షలు వరకు జమయ్యేవి. ఆ తర్వాత ఇవి ఒక్కసారిగా రూ.24-26 లక్షలకు పెరిగినట్టు దర్యాప్తులో గుర్తించారు. ఈ ప్రకారం రోజుకు 8 లక్షల వరకు కాజేసినట్టు తెలుస్తోంది. ఎనిమిది మంది నిందితుల్లో ఐదుగురు అనుమానాస్పదంగా సీసీటీవీ ఫుటేజీల్లో కనిపించడం తెలిసిందే. వీరు విరాళాలను లెక్కించే సమయంలో, బ్యాంకుకు తరలించే సమయంలో జేబులు, షూ సాక్సులో దాచేసి, పక్కదారి పట్టించడం గమనార్హం. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా నియమితులైన వీరు, భక్తుల కానుకలను బాగానే బుక్కేసి ఉంటారని తెలుస్తోంది. సిట్ నివేదిక ఇంకా వెలుగు చూడాల్సి ఉన్నప్పటికీ ఇందులోని కొన్ని సంచలన విషయాలు విశ్వసనీయ వర్గాల సమాచారం ఆధారంగా బయటకు వచ్చాయి. నిందితుల్లో ఒకరైన ఔట్‌సోర్స్ ఉద్యోగి అవినాష్ శుక్లా.. ఆలయంలో కానుకల లెక్కింపు కేంద్రం వద్ద ఉద్యోగిగా నియమితుడు కాక ముందు వరకు హనుమాన్ గుహ వద్ద తాగునీటి విక్రయ కేంద్రం నిర్వహించే వాడని తెలిసింది.

మిగతా 2లో

# మహానగర ప్రజా రవాణా వ్యవస్థకు హైదరాబాద్ వెన్నెముక

- కిషన్‌రెడ్డీ.. వ్యక్తిగతంగా జోక్యం చేసుకోండి
- ఖట్టర్.. తక్షణమే ప్రత్యేక చొరవ చూపండి
- మెట్రో విస్తరణలో జాప్యం లేకుండా చూడండి
- కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ అత్యవసర లేఖలు
- ఫేజ్-2 విస్తరణకు తక్షణమే ఆమోదం తెలపాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి ఫేజ్-1 బదిలీని వేగిరం చేయాలి
- ఎస్‌బీఐ క్యాప్స్ నియామకంలో ఎందుకీ జాప్యం?
- జూన్‌లో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ అమలు కాలేదు
- లేఖల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన



హైదరాబాద్, **ఐఎన్‌బిటైమ్స్** రాష్ట్ర భవిష్యత్తు ప్రగతికి, హైదరాబాద్ మహానగర ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణ (ఫేజ్-2), నిర్వహణ (ఫేజ్-1) విషయాల్లో కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఫేజ్-2 నిర్మాణానికి తక్షణమే పరిపాలన, ఆర్థిక ఆమోదం తెలపాలని, ఫేజ్-1 ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు అంశాలు పరస్పరం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నందున.. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే నిర్ణయా లు తీసుకోవాలన్నారు. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిలకు శనివారం సీఎం వేర్వేరుగా లేఖలు రాశారు. మెట్రో ప్రాజెక్టు అమలులో జరిగే ఆలస్యం వల్ల ప్రతి నెలా ధరల పెరుగుదల,

మిగతా 2లో

# చేతగాకపోతే తప్పుకోండి.. ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్

- కేసీఆర్‌పై కక్షతో తెలంగాణ రైతాంగాన్ని శిక్షిస్తారా?
- ఎల్ నినోతో వానల్లేక, పొలాలు ఎండుతుంటే.. లక్ష క్యూసెక్కుల నీళ్లు
- సముద్రంలోకి వదిలేస్తారా?
- వెంటనే నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలి
- లేదంటే ప్రాజెక్టును ముట్టడించి పంపులను ఆన్ చేస్తం
- యూరియా, కరెంటు ఇవ్వాల్సి వస్తదనే నీళ్లిస్తలేరు
- మేం రైతుల కోసం వస్తే సీఎంకు భయమెందుకు?
- కన్నెపల్లికి వెళ్లకుండా మమ్మల్ని కాంగ్రెస్ ప్రభుత్వం
- అడ్డుకున్న తీరును తెలంగాణ సమాజం చూసింది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి సిగ్గుంటే తక్షణమే పంప్‌హౌస్‌లు ప్రారంభించాలె



వరంగల్,**ఐఎన్‌బిటైమ్స్**

అయ్యా రేవంత్ రెడ్డీ.. నీకు మనసు లేకపోతేనో.. తెలివిలేక పోతేనో మా నాయకుడు కేసీఆర్‌కు వారం రోజులు కాళేశ్వరాన్ని అప్పగించు.. నువ్వేం భయపడకు.. నీ పదవి మళ్లీ నీకే ఇస్తం.. మేడిగడ్డను రిపేర్ చేసి చూపిస్తం.. మొత్తం తెలంగాణ అంతా నీళ్లు పారించి సస్యశ్యామలం చేసి చూపించే బాధ్యత మాది' అని కాంగ్రెస్ సర్కార్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. కాళేశ్వరం పంప్‌హౌస్ నుంచి వెంటనే నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ నీటిని ఎత్తిపోయకపోతే యాభై, అరువై వేల మందితో కలిసి వచ్చి కన్నెపల్లిని ముట్టడించి పంపులను

మిగతా 2లో

# గొడ్డలి పార్టీ నేతలు కూటమి ప్రభుత్వంపై కుట్రలు, బూతులు, హింస!

చెడ్డపేరు తెచ్చుకోవద్దు..
'త్వరలో రానున్న మున్సిపల్ సహా అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమే గెలువబోతోంది. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చి తీరుతాం. గతానికంటే మెజారిటీలు పెరిగేలా కృషి చేయాలి. కార్యకర్తల ఆర్థిక సాధికారతకు పార్టీపరంగా కృషి చేస్తున్నాం. చెడ్డపేరు తెచ్చుకునేలా ఎవరూ వ్యవహరించకూడదు. పనితీరు ఆధారంగా పదవులు దక్కుతాయి. ఎలాంటి మొహమాటాలూ ఉండవు. పార్టీ కోసం పనిచేసేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించం. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలి. పార్టీ సూచనలకు అనుగుణంగా ఈ ప్రక్రియను చేపట్టాలి' అని టీడీపీ శ్రేణులకు చంద్రబాబు సూచించారు. 2019-24 కాలం రాష్ట్రానికి ఓ పీడకల లాంటిదన్నారు. గొడ్డలి పార్టీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పేదల పక్షాన నిలిచే టీడీపీ నేతలు, కార్యకర్తలకు అధికారులు, పోలీసులు కూడా సహకరించాల్సిందేనని సీఎం స్పష్టంచేశారు. 'పై స్థాయిలోనే కాదు, క్షేత్రస్థాయిలో కూడా పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలి. సమస్యల పరిష్కారంలో పోలీసులు, అధికారులతో పార్టీ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలి. క్షేత్ర స్థాయి వాస్తవాలను ప్రభుత్వ, పోలీసు అధికారులకు వివరించి సమస్యలు పరిష్కరించేలా చూడాలి. పథకాల అమలులో ఇబ్బందులు, జాప్యం చోటుచేసుకుంటే.. సరిచేసే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలి' అని సూచించారు.

రైతుల కోసం ఐటీసీతో ఒప్పందం

కుప్పం రైతులకు ప్రయోజనం కలిగేలా ఐటీసీ సంస్థతో కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఒప్పందం కుదుర్చుకుంది. పండ్లు, కూరగాయాల క్లస్టర్ల ద్వారా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాలకు ఉత్పత్తులు మార్కెటింగ్ చేసేలా ఈ ఒప్పందం చేసుకున్నారు. అధునాతన వ్యవసాయ విధానాలు అనుసరించేలా కడాతో విశాలాక్షి ఇన్నోవేషన్స్ సస్టెయినబుల్ వాల్యూ చైన్ సంస్థ ఒప్పందం చేసుకుంది.

పర్యావరణ నియంత్రిత పౌల్ట్రీ ఫాం..
సీఎం కడపల్లెలో పర్యావరణ నియంత్రిత పౌల?ట్ర ఫాంను ఆదివారం ప్రారంభించారు. ఆధునిక కోళ్ల పెంపకానికి సంబంధించిన ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ పౌల్ట్రీ షెడ్‌ను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఉష్ణోగ్రత, తేమ, గాలి, వెలుతురు.. అన్నింటినీ సాంకేతికత ద్వారా నియంత్రించి కోళ్లకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించవచ్చని వారు వివరించారు. దీంతో గుడ్లు, మాంసం ఉత్పత్తి పెరగడంతో పాటు కోళు చనిపోవడం తగ్గుతుందని తెలిపారు.

ప్రపంచానికి ఆదర్శంగా పీ-4

పీ-4 మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో చంద్రబాబు సమావేశమయ్యారు. సంపద సృష్టి, ఆర్థిక అసమానతల తొలగింపు, అందరికీ మెరుగైన జీవన ప్రమాణాల కల్పనే పీ-4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన చెప్పారు. దీనిని ఆదర్శ కార్యక్రమంగా ప్రపంచానికి అందిస్తామన్నారు. 'రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించగా.. 1.10 లక్షల మంది మార్గదర్శులు ఆదుకోవడానికి ముందుకొచ్చారు. కుప్పంలో 9 వేల కుటుంబాలను అదానీ, టీవీఎస్, మేఘా సంస్థలకు అప్పగించాం. జీవన ప్రమాణాలు మారిన కొన్ని బంగారు కుటుంబాల విజయగాథలను రాష్ట్ర ప్రజలందరికీ చేరవేస్తాం' అని తెలిపారు.

# మహానగర ప్రజా రవాణా వ్యవస్థకుహైదరాబాద్ వెన్నెముక

వడ్డీ భారంనిర్మాణ సామగ్రి వ్యయం పెరిగి ప్రాజెక్టుపై రూ.వేల కోట్ల అదనపు భారం పడే ప్రమాదం ఉందని లేఖల్లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లేఖల ప్రతిని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం మీడియాకు విడుదల చేసింది. ఇందులో.. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ విషయంలో కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి వ్యక్తిగతంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సీఎం కోరారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, రైల్వే శాఖలతో స్వయంగా మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 23న రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో, 24న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో.. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో జరిగిన కీలక సమావేశాలను లేఖలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా గుర్తుచేశారు.

ఆ సమావేశాల్లో.. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 బదిలీ, ఫేజ్-2 విస్తరణపై ఎంతో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, ఇప్పటివరకు వాటిలో ఒక్కటి కూడా అమల్లోకి రాలేదంటూ అసంతృప్తి, ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ (ఎస్‌బీఐ క్యాప్స్)కు హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ, ఆర్థిక పరిస్థితుల సమీక్ష, తెలంగాణ ప్రభుత్వానికి బదిలీకి అవసరమైన ఆర్థిక పరిశీలన బాధ్యతలు అప్పగించాలనే అంగీకారం కుదిరిందని సీఎం తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ రుణాలుగా మార్చే రీఫైనాన్సింగ్ అవకాశాలను కూడా ఎస్‌బీఐ క్యాప్స్ పరిశీలించాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. మెట్రో ఫేజ్-2 నిర్మాణానికి భారీ స్థాయిలో పెట్టుబడులు అవసరమవుతాయని, అందుకే ఫేజ్-2కు అవసరమైన ఆర్థిక నమూనా, దీర్ఘకాలిక రుణాల సమీకరణ, వివిధ నిధుల వనరుల అన్వేషణ, సమగ్ర ఆర్థిక వ్యూహానికి కూడా అదే సంస్థ రూపకల్పన చేయాలని నాటి భేటీలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కోసం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్)ను వెంటనే ఖరారు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ మొత్తం వ్యవహారాన్ని సమన్వయం చ్గసందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మునిసిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నోడల్ అధికారిగా నియమించిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు.

ఇకపై జాప్యం చేయొద్దు..

జూన్‌లో నిర్ణయం తీసుకుంటే ఇప్పటిదాకా ఎస్‌బీఐ క్యాప్స్‌ను కేంద్రం అధికారికంగా నియమించలేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను కూడా ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి పంపలేదన్నారు. దీంతో మెట్రో ఫేజ్-1 బదిలీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని, ఇది రోజువారీ నిర్వహణలోనూ ఇబ్బందులకు దారితీస్తోందని తెలిపారు. అంతేకాకుండా ఎస్‌బీఐ క్యాప్స్ నియామకం ఆలస్యం కావడం వల్ల మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు కేంద్ర అనుమతులు కూడా ఆలస్యమవుతున్నాయని చెప్పారు.

ఇకపై ఎలాంటి జాప్యం చేయకుండా అన్ని ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని కేంద్రాన్ని కోరారు. మెట్రో ఫేజ్-1 తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ, ఫేజ్-2 వేగంగా అమలైతే నగర ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని కోరారు. 'హైదరాబాద్ మెట్రో భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. పెండింగ్ ఫైళ్లను ముందుకు కదిలించేందుకు కేంద్రం పెద్దలతో మాట్లాడాలి' అని రేవంత్ కోరారు.

# జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ ప్రక్రియ విజయవంతం

అమరావతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ముగిసింది. జనసేన పార్టీ నిర్మాణ సారథుల కమిటీలు ఏడు రోజులుగా... పార్టీ నాయకత్వ బాధ్యతలు స్వీకరించేందుకు ఆసక్తిగా ఉన్న నాయకులు, సాధకులు, జనసైనికుల నుంచి దరఖాస్తులు స్వీకరించాయి. 25 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో గతనెల 25న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఏడు రోజులపాటు కొనసాగి ఆదివారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 35 వేల దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ మాట్లాడుతూ... రాజకీయాల్లో నూతన ఒరవడి సృష్టించి, పార్టీ నిర్మాణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టిన ఘనత జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు దక్కుతుందన్నారు. జనసేన పార్టీలోని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి పదవులకు సంబంధించి సమాచార సేకరణ అనే గొప్ప ప్రక్రియ ఇదన్నారు. జెన్‌జీ ఆలోచనలకు దగ్గరగా, పారదర్శకంగా పార్టీని బలోపేతం చేసే క్రతువులో ఆదివారం నాటికి భారీస్థాయిలో దరఖాస్తులు వచ్చాయన్నారు. యువత భారీగా స్పందించి పార్టీ పదవుల కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన వారు, పార్టీ ఉన్నతికి ఆలోచించే ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వాలనే తలంపుతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వచ్చిన దరఖాస్తులను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జాగ్రత్తగా పరిశీలించి, అందరితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటారని వివరించారు.

# చేతగాకపోతే తప్పుకోండి.. ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్

ఆన్‌చేసి రైతులకు నీళ్లు ఇస్తామని హెచ్చరించారు. ఓవైపు రాష్ట్రంలో కరువు పరిస్థితులు, మరోవైపు ఎల్‌నినో ప్రభావం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు.ఇంతటి కరువు పరిస్థితుల్లో కూడా మేడిగడ్డ వద్ద లక్షల క్యూసెకుల గోదావరి నీరు సముద్రంలో కలిసిపోతున్నా, రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిప్పులు చెరిగారు. రైతుల కోసం ప్రధాన ప్రతిపక్షంగా కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వస్తుంటే తమను పోలీసులు ఎకడికకడ అడ్డుకోవడాన్ని తెలంగాణ సమాజం చూసిందని పేరొన్నారు. ప్రజల సమస్యల కోసం వస్తున్న తమపై ఇంతటి పోలీసు నిర్బంధం ఎందుకు విధిస్తున్నారని నిలదీశారు. 'రైతుల కోసం మేము వస్తే రేవంత్‌రెడ్డికి ఎందుకంత భయం?' అని నిలదీశారు. 'రాష్ట్రానికి పట్టిన శని రేవంత్‌రెడ్డి' అని ధ్వజమెత్తారు. కన్నెపల్లి పంప్‌హౌస్ పరిశీలన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్ సమీపంలో గోదావరి నదీ ప్రవాహాన్ని కేటీఆర్ ఆదివారం పరిశీలించారు. అనంతరం శాసనమండలిలో విపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మె ల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, మాలోత్ కవిత, బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, వొడితెల సతీశ్‌కుమార్, గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గొంగిడి సునీత, బాల్క సుమన్, అరూరి రమేశ్, రసమయి బాలకిషన్, తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, జీవన్‌రెడ్డి, సుంకె రవిశంకర్, నడిపెల్లి దివాకర్‌రావు, ఎన్.భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, పార్టీ నాయకులు వాసుదేవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, పెద్ది స్వప్న, బడే నాగజ్యోతి, లక్ష్మణ్‌బాబు తదితరులతో కలిసి ఆయన మీడియా తో మాట్లాడారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ స ర్కార్ అనుసరిస్తున్న జలవిధానంపై నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో మంత్రి ఉత్తమ్ చెప్తున్న కుంటిసాకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి సిగ్గుంటే తక్షణమే పంపులు ప్రారంభించి నీటిని ఎత్తిపోసి జలాశయాలు నింపాలని డిమాండ్ చేశారు. లక్షల క్యూసెకుల నీటిని వృథాగా కిందికి పారదోలుతున్న అంశంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులను రైతులు గల్లా పట్టి అడుగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పంపులను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోయకుంటే యాభై, 60 వేల మందితో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడించి తామే పంపులను ఆన్‌చేస్తామని రేవంత్ సర్కార్‌కు అల్టిమేటం జారీ చేశారు.

# అయోధ్య రామాలయ విరాళాల అక్రమాలపై దర్యాప్తులో సంచలన విషయాలు

శనివారం రాత్రి అతడినుంచి అయోధ్య పోలీసులు మారుతి బ్రెజ్జా ఎస్‌యూవీని సీజ్ చేశారు. మరో నిందితుడైన లవ్‌కుష్ మిశ్రా గతేడాది అక్టోబర్ 16న బనీపూర్ ప్రాంతంలో 1,000 చదరపు అడుగుల ప్లాట్ కొనుగోలు చేసినట్టు వెలుగు చూసింది. రిజిస్టర్డ్ విలువ రూ.8లక్షలే ఉన్నప్పటికీ, మార్కెట్ విలువ రూ.25లక్షలు ఉంటుందని తెలుస్తోంది. మరో నిందితుడైన రామ్ శంకర్ అలియాస్ టిన్ను గతంలో డ్రైవర్‌గా పనిచేయగా, విరాళాల సొమ్ముతో ఒక హాస్టల్‌ను తెరిచినట్టు తెలిసింది.

బంగారు రామచరిత్ ఏమైంది?
అయోధ్య శ్రీరాముడికి భక్తులు ప్రేమతో సమర్పించిన కానుకలు, విరాళాల్లో అసలు ఎన్ని భద్రంగా ఉన్నాయి? ఎన్ని బకాసురుల జేబుల్లోకి వెళ్లాయన్నది? ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.. బంగారంతో చేసిన రూ.5కోట్ల విలువ చేసే రామచరిత మానస్ కూడా కనిపించడం లేదన్న విషయం వెలుగు చూసింది. కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ దీన్ని శ్రీరాముడి భవ్య మందిరానికి 2024 ఏప్రిల్‌లో విరాళంగా అందించారు. తొలుత కొంత కాలం పాటు ఆలయంలో భక్తుల కోసం ప్రదర్శించగా, ఆ తర్వాత నుంచి అది కనిపించడం లేదంటూ ఆయన తాజాగా బయట పెట్టారు. ఈ విషయమై ఆలయ అధికారుల నుంచి స్పష్టత కోరినప్పటికీ ఫలితం లేదని ఆయన ఆవేదన చెందుతున్నారు. "రామచరిత్ మానస్ అన్నది దివంగత నా మాతృమూర్తికి రాముడి పట్ల ఉన్న భక్తికి నిదర్శనం. ఆమె తన జీవితంలో 15-18 ఏళ్లు రామ నామం రాయడంలోనే గడిపారు. అప్పటివరకు భక్తుల కోసం ప్రదర్శించిన రామచరిత్ మానస్ ఉన్నట్టుండి కనిపించకుండా పోవడమేంటి?"అని లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. బంగారం పూతతో చేసిన 522 పేజీలతో కూడిన ఈ పుస్తకం బరువు 147 కిలోలు. తయారీకి బంగారంతోపాటు వెండి, రాగిని వాడారు.

సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారించాలి
అయోధ్య రామాలయం విరాళాలను పక్కదారి పట్టించిన అంశంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ పై కాంగ్రెస్ విరుచుకుపడింది. ఓటు చోరీ, సీటు చోరీ, చందాల చోరీ అనే మూడు సూత్రాల వ్యూహాన్ని బీజేపీ అమలు చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపణలు గుప్పించారు. అయోధ్య రామాలయం నిర్మాణం, ప్రారంభోత్సవ ఘనతను తమ ఖాతాలో వేసుకున్న మోదీ, అమిత్‌షా.. ఇప్పుడు మౌనంగా ఎందుకున్నారని ప్రశ్నించారు. ఈ కుంభకోణంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు.

రాజకీయ నేతల ఆరోపణల నిగ్గు తేల్చండి: వీహెచ్‌పీ
రామాలయ విరాళాల చోరీపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు నేతలు పెద్ద ఎత్తున చేస్తున్న సంచలన ఆరోపణల్లోని నిజంపాళ్లను తేల్చాలంటూ అయోధ్య పోలీసులను విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) లేఖ ద్వారా కోరింది. రూ.20,000వేల కోట్ల అక్రమాలు అంటూ పలువురు నేతలు ఆరోపిస్తున్న విషయాన్ని లేఖలో పేర్కొంది. ద్వేష, శత్రుత్వ భావనలు సృష్టించాలని ఆరోపణలు చేసినట్టు తేలితే వారిపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అయోధ్య డీఎ?సపీ అశుతోష్ తివారీకి లేఖ రాశారు.

# ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని శ్రీసిటీలో అమలు చేసేందుకు సిద్ధం

కొరియా ఎలక్ట్రానిక్స్ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేలా.. పరిశ్రమలను స్థాపించేలా సహకరించాలని దక్షిణ కొరియాలో భారత రాయబారి గౌరంగలాల్‌దాస్‌ను లోకేశ్ కోరారు. ఆదివారం సియోల్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. 'శాంసంగ్, ఎల్‌జీ, ఏఎస్ఐపీ-ఏపీఏసీటీ ఓశాట్ ఆధారంగా ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఏపీ ఎలక్ష?ట్రనిక్స్ పాలసీ 4.0కు అనుగుణంగా రాష్ట్రానికి కంపెనీలను రప్పించాలి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, చిప్స్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా సహకరించండి. శ్రీసిటీ, నాయుడు పేట, కొప్పర్తి, విశాఖపట్నంలో 'రెడీ టు యూజ్' క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయి. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్ర యూనివర్సిటీల్లో నైపుణ్యాభివృద్ధితో కూడిన కరిక్యులమ్‌ను అందిస్తున్నాం. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ ఈ ఏడాది ఏప్రిల్లో భారత్ పర్యటనకు వచ్చినప్పుడు కొరియా ఎన్‌క్లేవ్ ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనకు కార్యరూపం ఇచ్చేందుకు ఆ దేశ చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి చేసిన ప్రతిపాదన మేరకు ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని శ్రీసిటీలో అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని లోకేశ్ వెల్లడించారు. అనంతపురంలో కియ/హ్యూండయ్ మొబిస్ ఆటో-ఈవీ క్లస్టర్ విస్తరణపైనా చర్చ జరిగింది.రాష్ట్ర తీరప్రాంతంలో హెచ్‌డీ హ్యూండయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డును ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. ఏపీలో బ్యాటరీ/గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు స్థాపించేందుకు కొరియాను ఒప్పించాలన్నారు. కొరియా ప్లస్, కొరియా ట్రేడ్-ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (కోట్ర), భారత్-కొరియా పారిశ్రామిక సహకార కమిటీలను అనుసంధానిస్తూ ప్రత్యేక ఏపీ-కొరియా డెస్క్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ నెల పదో తేదీన నిర్వహిస్తున్న సియోల్ ఇన్వెస్టర్ రోడ్‌షోలో జీ 20 అవగాహన ఒప్పందాల వైపు కంపెనీలను మళ్లించేలా చొరవ చూపాలని గౌరంగ్‌దాస్‌ను కోరారు

# లోపాలు దాచి బీఆర్ఎస్ దుష్ప్రచారం

హైదరాబాద్, జూలై 5 కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో నిర్మాణ లోపాలను దాచి ప్రజలు, రైతులను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రాజెక్టును రాజకీయ ప్రచార సాధనంగా మార్చి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత ఆ పార్టీదేనని మండిపడ్డారు. సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోయవచ్చంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. "పంపులు ఆన్ చేయడం సాధ్యం కాదు... అసలు చేయలేం. శాస్త్రీయ పునరుద్ధరణ పూర్తయ్యే వరకూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిధిలో నీటి నిల్వ చేయరాదని జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ స్పష్టంగా ఆదేశించింది. మూడు బ్యారేజీల పునాదుల్లో తీవ్రమైన నిర్మాణ లోపాలు ఉన్నట్లు తేల్చింది" అని స్పష్టం చేశారు. కాళేశ్వరం సమస్యను రాజకీయ కోణంలో కాకుండా ఇంజినీరింగ్ కోణంలో చూడాలని సూచించారు. ఇది ఒక్క పిల్లర్ సమస్య కాదు... ఒక్క గేట్ సమస్య కాదు.. మొత్తం మేడిగడ్డ బ్యారేజీ పునాది వ్యవస్థ సమగ్రతకు సంబంధించిన సమస్య అని పేర్కొన్నారు. లోపాలను సరిచేయకుండా నీటిని నిల్వ చేస్తే భద్రాచలం సహా దిగువ ప్రాంతాలకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన విషయంలో ప్రభుత్వం ఏమాత్రం రాజీ పడదని స్పష్టం చేశారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును అమలు చేసి ఉంటే ఉత్తర తెలంగాణకు గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల స్థిర నీటి భద్రత లభించి ఉండేదని ఉత్తమ్ తెలిపారు. ఆ ప్రాజెక్టును కాళేశ్వరంగా మార్చి.. ఉత్తర తెలంగాణ భవిష్యత్తుతో బీఆర్ఎస్ ఆటలాడిందని విమర్శించారు.




# వరుసగా రెండోరోజు లాభాల్లో ముగిసిన మార్కెట్లు..

## 76వేల ఎగువన ముగిసిన సెన్సెక్స్..!



భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషనల్‌లో లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 76వేలు, నిఫ్టీ 23వేల పాయింట్ల ఎగువ ముగిసింది. గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ ఫలితాల మధ్య లాభాల్లో మొదలైన మార్కెట్లు చివరి వరకు అదే జోరును కొనసాగించాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, జొమోటో షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఫిబ్రవరి 1న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ సారి బడ్జెట్‌లో పన్ను మినహాయింపులు ప్రకటించనున్నారని భావిస్తున్నారు. అలాగే, ఆర్‌బీఐ సైతం వడ్డీ రేట్లను తగ్గించనున్నదనే అంచనాల నేపథ్యంలో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే 76,138.24 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 75,975.80 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది.గరిష్ఠంగా 76,599.73 పాయింట్లను తాకింది. చివరకు 631.5 పాయింట్ల లాభంతో 76,532.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 205.85 పాయింట్లు పెరిగి 23,163.10 వద్ద స్థిరపడింది. దాదాపు 2,874 షేర్లు పురోగమించగా.. మరో 937 షేర్లు పతనమయ్యాయి. మీడియా, క్యాపిటల్ గూడ్స్, ఐటీ, మెటల్, రియల్టీ రెండు నుంచి మూడుశాతం.. ఆటో, బ్యాంక్, ఫార్మా, ఆయిల్, గ్యాస్ 0.5 నుంచి 1.5 శాతం మధ్య లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ సూచీ 0.5 శాతం పతనమైంది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.5 శాతం, స్మాల్ క్యాప్ సూచీలు 3.2 శాతం పెరిగాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, విప్రో, టాటా మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్ అత్యధికంగా లాభపడగా.. ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, బీపీసీఎల్, బ్రిటానియా ఇండస్ట్రీస్, ఐటీసీ నష్టపోయాయి.

## పన్ను మినహాయింపులు ఇస్తారా..?




పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటిన పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై పలు రంగాలు భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందులో ఒకటి రియల్ ఎస్టేట్ రంగం. వాస్తవంగా బడ్జెట్ అంటే.. అన్ని వర్గాలు తమకు ఏదైనా శుభవార్త చెబుతారేమోనని ఆశపడుతుంటాయి. ఈ సారి ప్రభుత్వం, బడ్జెట్ వైపు రియల్ ఎస్టేట్ రంగం సైతం భారీగానే ఆశలు పెట్టుకున్నది. గత ఏడాది రియల్ ఎస్టేట్ రంగం తీవ్రమైన గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నది.ఈ క్రమంలో బడ్జెట్‌లో ఏమైనా ఊరట కలుగుతుందేమోనని రియల్ ఎస్టేట్ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రస్తుతం గృహ రుణాల వడ్డీ రేట్లు పెరగడంతో పాటు ఇండ్లు కొనుగోలు చేస్తే వర్తించే పన్ను మినహాయింపులు పరిమితంగానే ఉన్నాయి. భారీగా పెరిగిన ధరల నేపథ్యంలో వేతన జీవుల ఆదాయం ఎక్కువగా ఇంటి అవసరాలకే సరిపోతుంది. దాంతో సొంతింటి కల చివరకు.. కలగానే మిగిలిపోతున్నది. రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ ఉంటేనే.. మిగతా రంగాల వ్యాపారాల్లోనూ పెరుగుదల ఉంటుందని.. లేదంటే తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

## పన్ను ఊరట దక్కేనా?



న్యూఢిల్లీ, జనవరి 28: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం (ఫిబ్రవరి 1) బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. దీంతో ఆదాయ పన్ను (ఐటీ) విధానానికి సంబంధించి ట్యాక్స్‌పేయర్స్, సగటు వేతన జీవులు భారీ ఆశల్నే పెట్టుకున్నారు. పాత, కొత్త ఆదాయ పన్ను విధానాలను అనుసరించేవారు మాకివి కావాలన్న డిమాండ్లను వ్యక్తం చేస్తున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్ల పతనం, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ క్షీణత, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తగ్గుతున్న వృద్ధిరేటు అవకాశాలు, అధిక వడ్డీరేట్లు, నిరాశపరుస్తున్న ఉత్పత్తి, మందగించిన వినిమయ సామర్థ్యం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావం వంటివి ఇప్పుడు మోదీ సర్కారుకు సవాల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ ఎవరి అంచనాల్ని, మరెవరి ఆశల్ని ఎంతవరకు నెరవేరుస్తుందన్నది మిక్కిలి ప్రాధాన్యతగా నిలుస్తున్నది.

## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి తిలక్ వర్మ..





ఇంగ్లాండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో టీ20లో ఐదు వికెట్ల పడగొట్టిన భారత జట్టు లెగ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐసీసీ టీ20 ఇంటర్నేషనల్ ర్యాకింగ్స్‌లో టాప్-5కి చేరుకున్నాడు. ఏకంగా 25 స్థానాలు ఎగబాకి తొలిసారిగా ఐదో ప్లేస్‌కి చేరుకున్నాడు. అదే సమయంలో భారత స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్‌ని అధిగమించాడు. టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

ఘనత సాధించిన మూడో భారత బౌలర్..

ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి బంతితో అద్భుత ప్రదర్శన చేశాడు. అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో రెండోసారి ఒక మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఘనత సాధించాడు. దాంతో టీ20ల్లో భారత్ తరపున ఒకటి కంటే ఎక్కువసార్లు ఐదు లేదంటే అంతకన్నా ఎక్కువ వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా నిలిచాడు. ఇంతకు ముందు భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్ ఈ ఘనత సాధించారు. 2018లో దక్షిణాఫ్రికా, 2022లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన టీ20ల్లో భువనేశ్వర్ ఐదు వికెట్లు తీశాడు. 2018లో ఇంగ్లాండ్, 2023లో దక్షిణాఫ్రికాపై కుల్దీప్ యాదవ్ వికెట్లు పడగొట్టాడు. వరుణ్ గతేడాది దక్షిణాఫ్రికాలో 17 పరుగులు ఇచ్చి ఐదు వికెట్ల కూల్చాడు.

### అగ్రస్థానానికి ఆదిల్ రషీద్

ఇంగ్లాండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ భారత్‌తో జరుగుతున్న సిరీస్‌లో బంతితో రాణించాడు. దాంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు. రషీద్ 2023లోనూ అగ్రస్థానానికి చేరుకోగా.. తాజాగా వెస్టిండిస్ బౌలర్ అకిల్ హుస్సేన్‌ని అధిగమించి అగ్రస్థానానికి చేరాడు. 718 రేటింగ్ పాయింట్ల రషీద్ ఖాతాలో ఉన్నాయి. అకిల్ హుస్సేన్ రెండో స్థానంలో ఉండగా.. శ్రీలంక ఆటగాడు వనిందు హసరంగ మూడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటి వరకు ఇంగ్లాండ్‌తో ఆడిన మూడు మ్యాచుల్లో 108 పరుగులు చేశాడు. ఇందులో ఓ హాఫ్ సెంచరీ ఉన్నది. దాంతో కెరియర్‌లో తొలిసారిగా ఐసీసీ ర్యాకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. 832 పాయింట్లతో బ్యాటర్స్ ర్యాకింగ్‌లో రెండో స్థానానికి చేరాడు. ఇక ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ 855 పాయింట్లతో నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో సత్తా చాటిన టీమిండియా ప్లేయర్లు...




యువ ఆటగాళ్లు తిలక్ వర్మ, వరుణ్ చక్రవర్తికి కెరీర్ బెస్ట్ ర్యాంకులు

బ్యాటింగ్ విభాగంలో తిలక్‌కు రెండో ర్యాంక్

బౌలింగ్ విభాగంలో వరుణ్ చక్రవర్తికి ఐదో ర్యాంక్

ఐసీసీ బుధవారం విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్ లో టీమిండియా ప్లేయర్లు సత్తా చాటారు. యువ ఆటగాళ్లు తిలక్ వర్మ, వరుణ్ చక్రవర్తి అదరగొట్టారు. ఇటీవల అద్భుతంగా రాణిస్తున్న తెలుగు కుర్రాడు తిలక్ వర్మ బ్యాటింగ్ విభాగంలో కెరీర్ బెస్ట్ ర్యాంక్ సాధించాడు. గతేడాది నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో వరుసగా రెండు శతకాలు బాదిన తిలక్... ప్రస్తుతం స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న సిరీస్‌లోనూ బ్యాట్ ఝుళిపిస్తున్నాడు.

రెండో టీ20లో అజేయంగా 72 పరుగులు చేసి, భారత జట్టును ఒంటి చేత్తో గెలిపించాడు. ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్న తిలక్ భారీ ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకుంటున్నాడు. అదే ఇప్పుడు అతడిని కెరీర్ బెస్ట్ ర్యాంక్ సాధించేలా చేసింది. ప్రస్తుతం 832 రేటింగ్ పాయింట్స్ తో తిలక్ ఏకంగా రెండో స్థానంలో నిలిచాడు.

ఇక ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ (855 రేటింగ్ పాయింట్స్) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 4వ ర్యాంక్ దక్కించుకున్నాడు.

మరోవైపు బౌలింగ్ విభాగంలో టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా టీ20 ర్యాంకింగ్స్ లో అదరగొట్టాడు. ఏకంగా 25 స్థానాలు ఎగబాకి 5వ ర్యాంక్ దక్కించుకున్నాడు. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ లో నిలకడగా రాణిస్తున్న వరుణ్ ప్రస్తుతం 679 రేటింగ్ పాయింట్స్‌తో 5వ ర్యాంక్‌లో నిలిచాడు. భారత జట్టు మరో స్పిన్నర్ అక్షర్ పటేల్ కూడా 5 స్థానాలు మెరుగుపర్చుకుని 11వ ర్యాంక్ సాధించాడు. ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ టాప్‌లో నిలిచాడు.

టీ20ల్లో టాప్-5 బ్యాటర్లు..

1. ట్రావిస్ హెడ్- 855 (రేటింగ్ పాయింట్స్)
2. తిలక్ వర్మ- 832 (రేటింగ్ పాయింట్స్)
3. ఫిల్ సాల్ట్- 782 (రేటింగ్ పాయింట్స్)
4. సూర్యకుమార్ యాదవ్- 763 (రేటింగ్ పాయింట్స్)
5. జోస్ బట్లర్- 749 (రేటింగ్ పాయింట్స్)

టీ20ల్లో టాప్-5 బౌలర్లు

1. ఆదిల్ రషీద్ (ఇంగ్లాండ్)- 718 (రేటింగ్ పాయింట్స్)
2. ఆకీల్ హొసెన్ (వెస్టిండీస్)- 707 (రేటింగ్ పాయింట్స్)
3. వానిందు హసరంగ (శ్రీలంక) - 698 (రేటింగ్ పాయింట్స్)
4. ఆడమ్ జంపా (ఆస్ట్రేలియా)- 694 (రేటింగ్ పాయింట్స్)
5. వరుణ్ చక్రవర్తి (భారత్) - 679 (రేటింగ్ పాయింట్స్)

## టెస్టుల్లో స్టీవ్ స్మిత్ 10,000 పరుగులు..




పది వేల పరుగుల క్లబ్‌లో చేరాడు స్టీవ్ స్మిత్. టెస్టుల్లో ఆ మైలురాయి అందుకున్న 15వ బ్యాటర్‌గా నిలిచాడతను. శ్రీలంకతో జరుగుతున్న టెస్టులో అతను ఆ మైలురాయి దాటేశాడు. 10 వేల రన్స్ చేసిన నాలుగవ ఆసీస్ టెస్టు క్రికెటర్‌గా కీర్తికెక్కాడు.టెస్టుల్లో స్టీవ్ స్మిత్ 10,000 పరుగులు.. 15వ బ్యాటర్‌గా రికార్డు

గాలే: అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్ చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో పది వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఆ ఘనతను అందుకున్న 15వ బ్యాటర్ అయ్యాడు. దీంతో ఎలైట్ క్రికెటర్ల జాబితాలో చేరాడతను. ఇండియాతో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్ సమయంలో.. స్మిత్ పది వేల పరుగుల మైలురాయికి ఒక్క పరుగు దూరంలో నిలిచాడు. అయితే ఇవాళ శ్రీలంకతో ప్రారంభమైన టెస్టులో ఆ మైలురాయి దాటేశాడు.టెస్టుల్లో పది వేల రన్స్ చేసిన బ్యాటర్లలో 15వ ప్లేయర్‌గా నిలిచాడతను. ఆస్ట్రేలియా తరపున నాలుగవ బ్యాటర్ అయ్యాడు. గతంలో పది వేల రన్స్ చేసిన ఆసీస్ బ్యాటర్లలో రికీ పాంటింగ్(13,378), అలన్ బోర్డర్(11,174), స్టీవ్ వా(10,927) ఉన్నారు. టెస్టుల్లో లీడింగ్ రన్ స్కోరర్‌గా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. అతను 15,921 రన్స్ చేశాడు.

# అలా అనడంతో మనసు బాధపడ్డా

## కృతిసనన్



సినీరంగంలో పురుషాధిక్యతపై తాజా ఇంటర్వ్యూలో బాలీవుడ్ భామ కృతిసనన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కెరీర్ తొలినాళ్లలో ఎదురైన చేదు అనుభవాలను ఈ ఇంటర్వ్యూలో ఆమె గుర్తు చేసుకున్నది. 'సినిమాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి మొదట్నుంచీ నాకెక్కువే. ఫలానా సన్నివేశం ఇలా చేస్తే బావుంటుందని చెప్పాలనుంటుంది. కానీ ఇక్కడ హీరోయిన్లకు అంత సీన్ లేదు. ఓసారి ఓ దర్శకుడికి ఇలాగే సలహా ఇచ్చేందుకు ప్రయత్నించా. ఆయన ఇరిటేటవుతూ 'మరీ ఎక్కువగా ఆలోచిస్తున్నావ్.. చెప్పింది చెయ్' అన్నారు. నా మనసు చివుక్కుమన్నది. అదే సలహా హీరోలు ఇస్తే, 'ఆహా.. ఓహో..' అంటూ మెచ్చుకుంటారు.

సినిమా ప్రమోషన్స్‌లో హీరోయిన్లు ఎక్కడెక్కడ పాల్గొనాలో కూడా ఇక్కడ హీరోలే నిర్ణయిస్తారు. నాకు ఎదురైన మరో చేదు అనుభవం ఇది. నాకంటూ నిర్ణయాధికారం లేనప్పుడు, ఆ ప్రమోషన్లేవో వారే చేసుకోవచ్చుకదా.. అనిపించి, నేను రానని గట్టిగా చెప్పేశాను. కానీ దర్శక,నిర్మాతలు బతిమాలడంతో తప్పక ప్రమోషన్స్‌లో పాల్గొన్నా. ప్రస్తుతం ప్రాధాన్యత లేని పాత్రల్లో నటించేందుకు హీరోయిన్లెవరూ ఇష్టపడటంలేదు. నచ్చిన పాత్రల్నే ఎంచుకుంటున్నారు. అయినా ఇక్కడ ఇంకా పురుషాధిక్యతే కొనసాగుతున్నది' అంటూ చెప్పుకొచ్చింది కృతి సనన్.

# 'ఓజీ' ప్రీక్వెల్‌పై భారీ అంచనాలు..

## ఈసారి ఎలివేషన్స్ కాదు, కథే అసలు బలం!





స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఓజీ' బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ఈ చిత్రం విడుదలకు ముందే రికార్డు స్థాయి అంచనాలు సొంతం చేసుకోగా, విడుదల తర్వాత కూడా ఓపెనింగ్స్ విషయంలో కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. రాజకీయాల్లో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ నుంచి వచ్చిన సినిమా కావడంతో అభిమానులు ఈ చిత్రాన్ని భారీగా ఆదరించారు. వసూళ్ల పరంగా రూ.300 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి కమర్షియల్ హిట్‌గా నిలిచినప్పటికీ, సినిమా కథ విషయంలో మాత్రం కొంతమంది ప్రేక్షకులు మిశ్రమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా తొలి భాగంలో కథ కంటే హీరో ఎలివేషన్స్, స్టైలిష్ యాక్షన్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పూర్తి స్థాయి కథన అనుభూతి మిస్ అయిందనే అభిప్రాయం సినీ అభిమానుల్లో వినిపించింది.

అయితే ఇప్పుడు అందరి దృష్టి 'ఓజీ' ప్రీక్వెల్‌పై పడింది. తొలి భాగంలో మిగిలిపోయిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు, ప్రధాన పాత్ర నేపథ్యం, అతని ప్రయాణం, భావోద్వేగాలకు సంబంధించిన అంశాలను ప్రీక్వెల్‌లో మరింత బలంగా చూపించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తొలి భాగానికి వచ్చిన స్పందనను విశ్లేషించిన దర్శకుడు సుజీత్, ఈసారి కథనంపైనే ప్రధానంగా దృష్టి పెట్టినట్లు సమాచారం. కేవలం స్టైలిష్ మేకింగ్, పవన్ కళ్యాణ్ ఎలివేషన్స్‌పైనే కాకుండా, బలమైన కథ, పటిష్టమైన స్క్రీన్‌ప్లే, భావోద్వేగాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారట.

పవన్ కళ్యాణ్ స్క్రీన్ ప్రెజెన్స్, సుజీత్ విజువల్ టేకింగ్ ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు వాటికి తోడు బలమైన కథ కూడా జతకావడంతో ప్రీక్వెల్‌పై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఈసారి అభిమానులు మాత్రమే కాదు, సాధారణ ప్రేక్షకులను కూడా పూర్తిస్థాయిలో మెప్పించే సినిమా అందించాలనే లక్ష్యంతో చిత్రబృందం ముందుకు వెళ్తోందని టాక్. అయితే ప్రీక్వెల్ కథ, నిర్మాణంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న వార్తలతో 'ఓజీ' తదుపరి భాగంపై భారీ హైప్ నెలకొంది. కథ, ఎమోషన్, యాక్షన్ అన్నీ సమపాళ్లలో ఉంటే ఈసారి 'ఓజీ' బాక్సాఫీస్ వద్ద మరింత పెద్ద సంచలనం సృష్టించే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు.

# మిస్టీరియస్ కిల్లర్

స్వీయ దర్శకత్వంలో నటిస్తూ.. పద్మనాభరెడ్డితో కలిసి పూర్వాజ్ నిర్మించిన ఉమెన్ సెంట్రిక్ స్పై థ్రిల్లర్ 'కిల్లర్'. జ్యోతి పూర్వాజ్ కథానాయిక. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఆదివారం హీరోయిన్ జ్యోతి పూర్వాజ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ చిత్రం నుంచి ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సూపర్, మిస్టీరియస్ ఉమెన్‌గా కనిపిస్తున్న జ్యోతి పూర్వాజ్‌ని ఈ పోస్టర్‌లో ఇందులో జ్యోతి పూర్వాజ్ సూపర్ షీగా కనిపించనున్నదని, ఓ వినూత్న ప్రపంచాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుందని, సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. మనీష్ గిలాడ, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి, సంగీతం: అశీర్వాద్, సుమన్ జీవ, సమర్పణ: ఉర్వీజ్ పూర్వాజ్.



# అఖిల్‌కు కొత్త పేరు పెట్టిన అభిమాని

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటించిన తాజా చిత్రం 'లెనిన్' జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా తిరుపతిలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ అభిమానుల సందడితో ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల్, నాగార్జున, చిత్రబృందం మాట్లాడిన విషయాలకంటే... ఓ అక్కినేని అభిమాని చేసిన వినూత్న ప్రయత్నమే అందరి దృష్టిని ఆకర్షించింది. అఖిల్‌కు కొత్త పేరును సూచిస్తూ అతడు చెప్పిన సెంటిమెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.





సాధారణంగా సినీ ఇండస్ట్రీలో కొందరు హీరోలు కెరీర్ బాగా సాగాలని లేదా జ్యోతిష్య సూచనల మేరకు తమ పేర్లలో అక్షరాలు జోడించడం, మార్చుకోవడం చూస్తుంటాం. అయితే ఇక్కడ మాత్రం అభిమానినే స్వయంగా అఖిల్‌కు కొత్త పేరు పెట్టడం ఆసక్తికరంగా మారింది. అతడు సూచించిన పేరు 'నాగ అఖిల్ఙ. మొదట ఈ పేరు వినగానే సాధారణంగా అనిపించినా, దాని వెనుక ఉన్న భావాన్ని వివరించడంతో ఈవెంట్‌కు హాజరైన వారంతా చప్పట్లతో అభినందించారు. అభిమాని చెప్పిన ప్రకారం 'నాగ అఖిల్' అనే పేరులో అక్కినేని కుటుంబానికి చెందిన నలుగురు ప్రముఖుల పేర్లను ప్రతిబింబించేలా అక్షరాలను ఎంపిక చేశారట. 'నాగ' -- అక్కినేని లెజెండ్ నాగేశ్వరరావు పేరు నుంచి, 'అ' -- నానమ్మ అన్నపూర్ణమ్మ పేరు నుంచి, మళ్లీ 'నాగ' -- తండ్రి నాగార్జున పేరు నుంచి, అ' -- తల్లి అమల పేరు నుంచి తీసుకోవడం జరిగిందని అన్నారు.వీఈ నలుగురి పేర్ల స్ఫూర్తి, ఆశీస్సులు ఎప్పుడూ అఖిల్‌తో ఉండాలని భావించి 'నాగ అఖిల్' అని పేరు పెట్టినట్లు ఆ అభిమాని తెలిపాడు. ఈ సెంటిమెంట్‌కు అక్కడున్న అభిమానులు ఫిదా అయ్యారు. అక్కినేని కుటుంబంలో 'నాగ' అనే పదానికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావు, నాగార్జున, నాగ సుశీల, నాగ చైతన్య... ఇలా కుటుంబంలోని పలువురి పేర్లలో 'నాగ' ఉండటం తెలిసిందే. ఇప్పుడు అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అఖిల్ పేరుకు కూడా 'నాగ'ను జోడించాలని అభిమాని చేసిన సూచన సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, పలువురు అభిమానులు కూడా 'నాగ అఖిల్' పేరు బాగుందని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు అయితే 'లెనిన్' సినిమా ఘన విజయం సాధిస్తే ఈ కొత్త పేరు మరింత పాపులర్ అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.